1969 తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను గుర్తించాలి

కాచిగూడ: 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి నేతల త్యాగాలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్ రావు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎన్నో త్యాగాలు చేసిన విద్యార్థి ఉద్యమ నేతలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 1969 ఉద్యమ విద్యార్థి నేతల్లో ఇప్పటికే చాలా మంది చనిపోయారని, ప్రస్తుతం 50 లోపే ఉద్యమ నేతలు ఉండి ఉంటారని ఆయన తెలిపారు. విద్యార్థి ఉద్యమ నేతలు ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టు మిట్టాడుతూ దినమొక నరకంగా గడుపుతున్నారని, అలాంటి వారిని ఆదుకోవాల్సిన గురుతర బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఇటీవల విద్యార్థి నేత నాగయ్య(81) అనారోగ్యంతో ఆదిలాబాద్‌లో మృతి చెందాడని, ఆయన మృతి తెలంగాణ ఉద్యమకారులకు తీరని లోటు అని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమ సమయం నుంచి ఆయన చనిపోయే వరకు తెలంగాణ ఉద్యమకారుల కోసం ఎంతో కృషి చేశారని, ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. నింబోలిఅడ్డాలోని జేఏసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి గోపాల్‌రావు పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఉచిత ఆరోగ్య బీమా కార్డులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులు అందించిన త్యాగాలను గుర్తించి వారికి ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలని కోరారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలి


జగదీశ్వర్‌రావుకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, కోదండరెడ్డి

- మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, కోదండరెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన సంగిశెట్టి జగదీశ్వర్‌రావు ఆయన అనుచరులు

ముషీరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలని టీపీసీసీ కాంగ్రెస్ చేరికల కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, కోదండరెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పార్టీ టికెట్ దక్కలేదని బీఆర్ఎస్‌లో చేరిన ఈ నియోజకవర్గంకు చెందిన టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు, ప్రొటోకాల్ కమిటీ ఇన్‌చార్జీ సంగిశెట్టి జగదీశ్వర్‌రావు ఆయన అనుచరులు రాపోలు నర్సింహ్మా, గజ్జెల సూర్యనారాయణ, సిరిపల్లి శంకర్, నవీన్, నర్సింగ్‌రావు, బాలకృష్ణ, చంద్రమౌళి, కిట్టు, జెల్ల దినేష్, ప్రవీణ్, రఘు, నర్సింహ్మాగౌడ్, పలువురు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ చేరికల కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, కోదండరెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముషీరాబాద్ నియోజకర్గంలో దానం నాగేందర్‌కు మెజార్టీ ఓట్లు వచ్చేలా ప్రతి ఒక్కరూ సైనికులుగా పని చేయాలని సూచించారు. పార్టీలో చేరిన జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ... టికెట్ రాక పోవడంతో ఆవేశంతో కన్నతల్లి వంటి పార్టీని వీడటం జరిగిందన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు తిరిగి సొంత గూటికి రావడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జి.ఎస్.కేశవ్, అభిషేక్‌రెడ్డి, వేణుగౌడ్, అంజయ్య, రాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ ముమ్మర ప్రచారం


వీవీ గిరినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ముఠా జైసింహ

చిక్కడపల్లి: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు మద్దతుగా శుక్రవారం బీఆర్ఎస్ నగర నాయకుడు ముఠా జయసింహా గాంధీనగర్ డివిజన్ వి.వి.గిరినగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజవర్గ ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. గడచిన ఎన్నికల్లో ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను ఏవిధంగా గెలిపించారో అదే విధంగా పార్లమెంట్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, నాయకులు ముఠానరేశ్, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, పాశం రవి, ఎ.శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, హరికృష్ణగౌడ్, వంశీ, ఎస్త్రీపేమ్, హన్మంతు, నవీన్, దేవయ్య, విఠల్, బన్నీ, సుధాకర్, గణేశ్, ఎం.పద్మ, వనజ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం సభ్యులు రెండు రోజుల పాటు బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలను సందర్శించి ఏ గ్రేడ్ గుర్తింపు ప్రకటించారు. ప్రధానంగా కళాశాలలో సోషల్ సైన్స్, సైన్స్ విభాగం, వివిధ పరిశోధన లాబోరేటరీలు, వాణిజ్య, ఫుడ్‌సైన్స్ విభబుగాగం, న్యూట్రీషన్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్, ఇంటెన్సివ్ సౌకర్యాలు, కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం, పరీక్షల నియంత్రణ విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగం, పూర్వ విద్యార్థుల సభ్యుల బృందంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా ముఖాముఖి నిర్వహించారు. ఇంటర్ డిపార్ట్‌మెంట్ బోధనలు, ప్రాక్టికల్ అనుభవాలు సాధించిన మార్కుల ఫలితాల విశ్లేషణ విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు, బోధనలు, అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం, ఇంటర్ ప్రినియార్ సెల్, లైఫ్‌స్కిల్ ఫ్యాక్టరీలతో కళాశాలలో వివిధ సర్టిఫికెట్ కోర్సులను హైక్యూఏసీ వివిధ కమిటీల పనితీరును నివేధిక రూపంలో బృందం సభ్యులకు అందజేశారు. కళాశాల నివేదికలను పరిశీలించిన అనంతరం న్యాక్ బృందం శాఖాపరమైన పురోగతి, విజయాలను కళాశాల అధ్యాపకులతో సమావేశమైయ్యారు. అనంతరం న్యాక్ బృందం సభ్యులకు సాంస్కృతిక విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాక వెంకటస్వామి ఫౌండర్ ప్రెసిడెంట్ ఆశయాలను విద్యార్థులు వివిధ నృత్యరూపంలో ప్రదర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో న్యాక్ బృందం సభ్యులు కళాశాల అభివృద్ధిని కొన్ని చర్యలను సూచించారు. జ్ఞానాన్ని పంచుకోవడం, నైపుణ్యాభివృద్ధి కోసం పరిశ్రమలు, సంస్థల సహకారం, వినూత్న బోధనా పద్ధతుల, బోధనా విభాగాలు, మంచి రత్త, అంకిత భావం కలిగిన అధ్యాపకులు తదితర అంశాల ఆధారంగా ఈ సర్టిఫికెట్‌కు అర్హత సాధించింది.

మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలు విద్యార్థులకు దోహదం

ముషీరాబాద్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షలు విద్యార్థులకు దోహదపడతాయని ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతియేడు నిర్వహించే మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం విద్యానగర్‌లోని నానో జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రశ్నాపత్రాల విడుదల, పరీక్షల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతియేటా ఈ పరీక్ష మోడల్ ఎప్‌సెట్, నీట్ విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని అన్నారు. నానో కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, నాగరాజు, సహాయ కార్యదర్శి కిరణ్, నగర అధ్యక్ష, కార్యదర్శులు లెనినల్ గువేరా, అశోక్‌రెడ్డి, నాయకులు విఘ్నేష్, ప్రశాంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు

సివిల్స్ ర్యాంక్ సాధించిన మాజీ కానిస్టేబుల్‌కు పోలీసుల సన్మానం


ఉదయ్‌కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్ఐలు

చిక్కడపల్లి: ఇటీవలి సివిల్స్ ఫలితాల్లో ఆలిండియా 780వ ర్యాంక్ సాధించిన ఏపీకి చెందిన మాజీ కానిస్టేబుల్ ఉదయ్‌కృష్ణారెడ్డిని చిక్కడపల్లి పోలీసులు శుక్రవారం సాయంత్రం పీఎస్‌లో సన్మానించారు. 2013 నుంచి 2018వ సంవత్సరం వరకు ఏపీలోని గుడ్లూరు పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన ఉదయ్‌కృష్ణారెడ్డిని 2018లో తోటి 60 మంది కానిస్టేబుల్‌ల ముందు సీఐ అవమానించడంతో అదే రోజు ఉద్యోగానికి రాజీనామా చేసిన విషయం విదితమే. అది మొదలు క్రమశిక్షణతో, కఠోరంగా చదివి నాలుగో ప్రయత్నంలో ఈ ఏడాది సివిల్స్ ఫలితాల్లో 780వ ర్యాంక్ సాధించాడు. ఉదయ్‌కృష్ణారెడ్డి స్ఫూర్తి ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య పేర్కొన్నారు. ఎస్ఐలు శశిపాల్‌రెడ్డి, అభిలాష్, మౌనిక పాల్గొన్నారు.

మోదీకి హ్యాట్రిక్ విజయం తథ్యం

- తెలంగాణలో బీజేపీకి డబుల్ డిజిట్ సీట్లు ఖాయం
- 2030 నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది
- అంబర్‌పేటలో బీజేపీకి సానుకూల వాతావరణం
- మీట్ ద మీడియాలో సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 370 సీట్లు గెలుస్తుంది


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి కిషన్ రెడ్డి

నల్లకుంట: దేశం కోసం అహర్నిశలు పనిచేస్తున్న మోదీని మరోసారి ప్రధానిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేంద్ర మంత్రి, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం ఎంపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఎదురు లేదని, బీజేపీ 370 సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్త చేశారు. ఎన్‌డీఏతో కలిసి 400లకు పైగా సీట్లు గెలుస్తుందని జోస్యం చెప్పారు. శుక్రవారం ఓయూ ఎన్‌సీసీ చౌరస్తా సమీపంలోని ఓ హోటల్ బాంకెట్ హాల్‌లో మీట్ ద మీడియా కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణలో బీజేపీ డబుల్ డిజిట్ సీట్లు కైవసం చేసుకుంటుందన్నారు. మోదీ సమర్థవంతమైన విధానాలతో భారత్‌లో పేదరికం తగ్గిందని, భారత్ ప్రపంచ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో బీజేపీకి సానుకూల వాతావరణం నెలకొందన్నారు.

కోట్లాది రూపాయాలతో రైల్వే స్టేషన్‌లు ఆధునికీకరణ..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ కోసం రూ. 720 కోట్లు, కాచిగూడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు రూ. 450 కోట్లు, నాంపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ. 350 కోట్లు, చర్లపల్లిలో మోడ్రన్ రైల్వే స్టేషన్ నిర్మాణం కోసం నిధుల మంజూరులో తన వంతు కృషి చేశానని వివరించారు. సెప్టెంబర్‌లో ఈ రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. కేంద్ర నిధులతో ఓయూ ఆర్ట్స్ కళాశాల, గోల్కొండ కోటలో లైట్ అండ్ సౌండ్ షో ఏర్పాటు చేయించామన్నారు. ఆబిడ్స్‌లో ట్రైబల్ మ్యూజియం నిర్మాణానికి స్థలం కేటాయించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరగా స్థలం కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్కడ స్థలం కేటాయించారని, ఆ స్థలంలో రాంజీ గోండ్ పేరిట ట్రైబల్ మ్యూజియమ్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి శంకుస్థాపన చేశామన్నారు.

శ్మశానవాటిక వద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మాణం..

చేనంబర్ చౌరస్తా ఫ్లై ఓవర్ నిర్మాణంలో జాప్యానికి కారణం ఏంటని విలేకరులు ప్రశ్నించారు. అందుకు స్పందించిన కిషన్‌రెడ్డి.. అంబర్‌పేట ఎక్స్ రోడ్స్ ఎన్‌హెచ్ 202పై ఫ్లై ఓవర్ నిర్మాణానికి కేంద్రం రూ. 266 కోట్లతో నాలుగు లేన్ల ఫ్లై ఓవర్ నిర్మాణానికి విశేష కృషి చేశానని చెప్పారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సేకరించి ఇవ్వడంలో జీహెచ్ఎంసీ జాప్యం చేసిందని చెప్పారు. అలాగే అంబర్‌పేట శ్రీమణ చౌరస్తా సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న శ్మశాన వాటికలు ఉండటంతో పాటు అక్కడ రోడ్డు ఇరుకుగా ఉండడం కారణంగా పిల్లర్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుందన్నారు. మొదట్లో ఫ్లై ఓవర్ పిల్లర్ల నిర్మాణానికి స్థలం ఇస్తామని మైనార్టీ సోదరులు చెప్పారన్నారు. ఆ తరువాత కొందరి కారణంగా వాళ్ల స్థలాన్ని ఇచ్చేందుకు నిరాకరించారని తెలిపారు. అలాగే మరో 7 నిర్మాణాలు (బిల్డింగ్‌లు) ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ఆటంకంగా ఉన్నాయని, ఆ స్థలాలు కూడా సేకరించి తమకు అప్పగించాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను పలు మార్లు కోరానని చెప్పారు. శ్మశాన వాటికలు ఉన్న చోట స్టీల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రణాళిక రూపొందించామని వివరించారు. సమావేశంలో మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, కార్పొరేటర్లు అమృత, ఉమా రమేష్ యాదవ్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి ఏడెల్లి అజయ్ కుమార్, బీజేపీ నాయకులు బి.పవన్ రెడ్డి, మూల రవిందర్ గౌడ్, కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట బిడ్డను మరోసారి ఆశీర్వదించండి..

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోలేని మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీకి ప్రజల ఆదరణ పెరుగిందని, ఇది చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు తాము ఎలాంటి అభివృద్ధి చేయలేదని నిందలు మోపుతున్నారయని ధ్వజమెత్తారు.

- అంబర్‌పేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానని కిషన్‌రెడ్డి తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గ ప్రజల సహకారంతో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఇక సారి ఎంపీగా గెలిచానని తెలిన్నారు. ఎమ్మెల్యేగా 15 ఏళ్ల, ఎంపీగా కేంద్ర మంత్రిగా నాలుగున్నరేళ్ల నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టానని వివరించారు. కేంద్ర మంత్రిగా ఇతర పదవుల్లో సమర్థవంతగా విధులు నిర్వహించానని తెలిపారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొదటి విడత ఎన్నికల ప్రచారం చాలా వరకు ముగిసిందని, మరో నాలుగు ఐదు డివిజన్‌లు మిగిలి ఉన్నాయని చెప్పారు. త్వరలోనే రెండో విడత ప్రచారం ప్రారంభిస్తామని తెలిపారు.

నల్లకుంటలో పద్మారావుగౌడ్ ప్రచారం


ఉల్లిగడ్డల వ్యాపారిని ఓటడుగుతున్న పద్మారావుగౌడ్, కాలేరు వెంకటేష్

నల్లకుంట: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ శుక్రవారం సాయంత్రం నల్లకుంట డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలేరుతో కలిసి డివిజన్‌లో పాదయాత్ర చేస్తూ ఓటర్లను కలిసిన పద్మారావుగౌడ్ కారు గుర్తుపై ఓటేసి తనను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు.

కిషన్‌రెడ్డి గెలుపు ఖాయం



ముషీరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి విజయం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జి కనకేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్, ఇందిరానగర్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు సాయి, బాబు, రాములు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీకి అత్యధిక సీట్లు తథ్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పార్థసారథి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అత్యధిక సీట్లు కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాతిరి పార్థసారథి అన్నారు. 17 పార్లమెంట్ స్థానాలకు గాను పది స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ... సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. కిషన్‌రెడ్డి మాదిరిగా ఏ పార్లమెంట్ సభ్యుడు కూడా తాము చేసిన అభివృద్ధిపై నివేదికను సమర్పించలేదని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలే మరోమారు దేశంలో మోదీ అధికారంలోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కలకోట అరుణ్, సీనియర్ నేత జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పతి కోసం సతి ఎన్నికల ప్రచారం

ఇంటింటి ప్రచారం నిర్వహించిన కావ్య కిషన్‌రెడ్డి


నర్సింహబస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న కావ్య కిషన్‌రెడ్డి

నల్లకుంట: కేంద్ర మంత్రి, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి కావ్య కిషన్‌రెడ్డి ఇంటింటి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ నర్సింహ బస్తీలో కార్పొరేటర్ అమృతతో కలిసి కావ్య కిషన్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసిన ఆమె గత రెండు దశాబ్దాలుగా నియోజకవర్గంలో కిషన్ రెడ్డి చేసిన అభివృద్ధిని వివరించారు. అభివృద్ధిని చూసి కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి కిషన్‌రెడ్డిని రెండోసారి ఎంపీగా గెలిపించాలని ఓటర్లను కోరారు.

జేఈఈ మెయిన్‌లో శ్రీచైతన్య కళాశాల విద్యార్థుల హవా


డీడీ కాలనీ శ్రీచైతన్య కళాశాలలో జేఈఈ మెయిన్ విజేతలతో అధ్యాపకులు

అంబర్‌పేట: జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీచైతన్య కళాశాల డీడీ కాలనీ శాఖ ఉత్తమ ఫలితాలు సాధించింది. ఈ నెల 25న వెలువడిన ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడంతో శుక్రవారం డీడీ కాలనీలో కళాశాలలో విద్యార్థులతో కలిసి అధ్యాపకులు సంబరాలు చేసుకున్నారు. జాతీయ స్థాయిలో వేదాంత్ 26వ ర్యాంకు, ఆయుష్ 66, ధ్యవినే 123, కేశవ్ 135వ ర్యాంకులు సాధించారు. అలాగే 1000లోపు 336 మంది విద్యార్థులు ర్యాంకులు తెచ్చుకున్నారు. దీంతో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల డీన్ శ్రీవనారెడ్డి, ఏజీఎంలు సతీష్, అంకిరెడ్డి, అసోసియేట్ డీన్ ఉదయ్‌కిరణ్, ప్రిన్సిపాల్స్ సుజాత, తిరుపతి, వెంకటరమణ, వల్లి మాధవి, శ్రీధర్‌రెడ్డి, భాను ప్రకాశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

ముషీరాబాద్: మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం యువజన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌కు చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ మసూద్, గ్రేటర్ కమిటీ ఉపాధ్యక్షులు ఖైరత్ అలీబాబా, భోలక్‌పూర్ డివిజన్ మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షులు యాసిన్, బీఆర్ఎస్ నాయకులు అక్బర్ అలీ, మహ్మద్ ఎజాజ్, అజ్జు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి అంజన్‌కుమార్‌యాదవ్ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు జఫీర్ ఉద్దీన్, అల్లావుద్దీన్, జావిద్ నుష్రత్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులతో అంజన్‌కుమార్‌యాదవ్

బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయం ప్రారంభం


బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ముషీరాబాద్ డివిజన్‌లోని పార్సిగుట్ట వద్ద ఏర్పాటు చేసిన ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు భావిస్తు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, గ్రేటర్ యువజన కమిటీ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, మీడియా సెల్ ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

కాచిగూడ: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం.వేణుగోపాల్ తెలిపారు. బర్కత్‌పుర డిపో బస్సులకు సంబంధించి తమ సూచనలు, సలహాలతో పాటు సమస్యలు ఏవైనా ఉంటే తెలియజేయాలని ఆయన ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. వివరాలకు ఫోన్: 90004 06069లో సంప్రదించాలని ఆయన కోరారు.

29న దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం

కాచిగూడ: సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉండే దివ్యాంగులతో ఈ నెల 29వ తేదీన బీజేపీ నగర కార్యాలయంలో సోమవారం దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపు 20 వేల దివ్యాంగుల ఓటర్లు ఉన్నారన్నారు. కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా సుమారు రూ. 10 కోట్లు ఖర్చు పెట్టి వివిధ రకాల సహాయక పరికరాలను అందించిన మొదటి వ్యక్తి కిషన్‌రెడ్డి అని తెలిపారు. దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. దివ్యాంగులు అధిక సంఖ్యంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాలుష్య రహిత ప్రచారంపై దృష్టి సారించండి

ఎన్నికల సంఘానికి ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి

కాచిగూడ: కాలుష్య రహిత ప్రచారం జరిగేలా దృష్టి సారించాలని ఎన్నికల సంఘానికి ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.పి.హెచ్.రంగయ్య, జాతీయ సలహాదారు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల్లో నామినేషన్ల పర్వం ముగిసిన నేపథ్యంలో నాయకులు ప్రచారం పేరుతో పర్యావరణ విధ్వంసానికి పాల్పడే అవకాశం ఉందన్నారు., గతంలో చెప్పిన విధంగా పర్యావరణ హిత ప్రచారం జరిగేలా పార్టీల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం

ముషీరాబాద్: ఖైతరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీగా బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెన్ మాట్లాడుతూ... ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుకు భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఇదిలా ఉండగా ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జీలుగా మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సమీవుల్లా నియమితులయ్యారు. వీరి నియామకాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికలకు వీరు ఇన్‌చార్జీలుగా వ్యవహరించనున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంకు పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్‌ను నియమించారు.

బీసీల డిమాండ్లు నెరవేర్చే పార్టీలకే మద్దతు

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికలలో బీసీల డిమాండ్లను నెరవేర్చే పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. బీసీలను విస్మరించిన పార్టీలకు ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన చేపడతామని, బీసీ కులాల వారీగా రిజర్వేషన్లను పెంచుతామని, అవసరమైతే 50 శాతం సీలింగ్‌ను ఎత్తివేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. ఈ విషయంపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ సంఘాల నేతలు నీలం వెంకటేష్, సుధాకర్, నందగోపాల్, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి రిమాండ్

కాచిగూడ: ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసగించిన వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని మోతినగర్ ప్రాంతానికి చెందిన ఏడుకొండలు (34) ఇస్రోలో సీనియర్ టెన్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇస్రోలో ఉద్యోగం ఇప్పిస్తామని నింబోలిఅడ్డ లో ఉండే గుంటూరుకు చెందిన కృష్ణారావు వద్ద నుంచి రూ. 20 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బాలికను ప్రేమ పేరుతో వేధించిన యువకుడి అరెస్ట్

కాచిగూడ: ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన ఓ బాలికను ప్రేమ పేరుతో వేధించిన యువకుడిని కాచిగూడ పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఎస్ఐ నరేష్ కుమార్ సమాచారం మేరకు... శివరాంపల్లిలో నివాసం ఉంటున్న సాయికిరణ్ అలియాస్ నాని (20) కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాచిగూడకు చెందిన ఓ మైనర్ బాలిక ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైంది. ఆ బాలికను ప్రేమ పేరుతో తీవ్రంగా వేధించాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయికిరణ్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప సమాచారం మేరకు... ఫలక్‌నుమాకు చెందిన ఇమ్రాన్‌ఖాన్(25) వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి ఉందానగర్–తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతున్న ఆయనను రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.